ఇంటర్ చదవలేదు... సమస్య అవుతుందా

టెన్త్ తర్వాత కరస్పాండెన్స్ ద్వారా బీఏ చదివి ఎంబీఏ చేశాను. ఇంటర్యూల్లో ఇంటర్ సర్టిఫికెట్ అడిగితే ఏం చేయాలి? సాఫ్ట్‌వేర్ కంపెనీలకు దరఖాస్తు చేయాలంటే ప్రత్యామ్నాయం ఉందా? – శేషులత

■ పదో తరగతి తరువాత మీరు ఇంటర్మీడియట్ చదవలేదనేది యథార్థం. దాని గురించి మీరు ఎక్కువగా బాధపడాల్సిన పని లేదు. యూజీసీ నిబంధనల ప్రకారం మీరు కరస్పాండెన్స్ సిస్టం ద్వారా డిగ్రీ చదివి ఉంటే, ఇంటర్ చదవలేదని కంగారు పడకండి. ఒకవేళ ఇంటర్యూల్లో ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ అడిగితే, నిజాయతీగా ఇంటర్ చదవలేదని చెప్పండి. అలా చదవలేక పోవడానికి కారణాలను కూడా ధైర్యంగా చెప్పగలగాలి. ఏ ఇంటర్యూల్లో అయినా అబద్ధాలు చెప్పకుండా విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సానుకూల దృక్పథం ఉన్నవారిని విజయం వరించే అవకాశాలు ఎక్కువ. ఏదైనా ఉద్యోగ ప్రకటనలో ఇంటర్మీడియట్ కచ్చితంగా చదివి ఉండాలి అన్న నిబంధన ఉంటే తప్ప, డిగ్రీ/ పీజీ అర్హత ఉన్న అన్ని ఉద్యోగాలకూ మీరు అర్హులే. మీకు ఇంటర్ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల కొంత నష్టం కలుగుతుందని భావిస్తే, మీ నైపుణ్యాలతో, విషయ పరిజ్ఞానంతో, నిజాయతీతో ఇంటర్యూల్లో మెరుగైన ప్రతిభ చూపండి. మారుతున్న పరిస్థితుల్లో సాఫ్ట్‌వేర్ సంస్థ లైనా, ఇతర ప్రైవేటు నియామక సంస్థలైనా పేపర్ సర్టిఫికెట్ల కంటే రాత పరీక్షలో, ఇంటర్యూల్లో అభ్యర్థి చూపే ప్రతిభకు చాలా ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇంకా మీకు ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ అవసరం అనుకొంటే, ఓపెన్ స్కూలింగ్ ద్వారా కానీ, ప్రైవేటుగా కానీ ఇంటర్ పూర్తి చేయవచ్చు.

– ప్రొ. వెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

సులభంగా ఛేదిస్తారా..

సమస్యా పరిష్కార నైపుణ్యాలు

కెరియర్ ఏదైనా..
ఉద్యోగం ఎటువంటిదైనా..
సవాళ్లు సహజం. సమస్యలను తెలివిగా, సులభంగా పరిష్కరించడం నేటి విద్యార్థులు అభ్యసించాల్సిన ఒక ప్రధాన నైపుణ్యం. మరి ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ గురించి ఇంకా పూర్తిగా తెలుసుకుందామా..

'వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్' ఇటీవల విడుదల చేసిన 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' నివేదిక ప్రకారం.. సమస్యా పరిష్కార నైపుణ్యాలకు వచ్చే ఐదేళ్లలో ప్రాధాన్యం పెరగనుంది. టెక్నికల్ స్కిల్స్‌కి ఉన్నంత ప్రాముఖ్యం వీటికి లభిస్తుందని ఇప్పటికే నిపుణులు చెబుతున్నారు. ఉద్యోగార్థులు అతి ముఖ్యమైన ఈ స్కిల్‌ను నేర్చుకోవడంలో ముందుండాలని సూచిస్తున్నారు. సమస్యలను ముందుగా గుర్తించడం, వేగంగా పరిష్కరించడం ఉన్నత స్థాయి పోస్టులకే కాదు.. ప్రవేశ స్థాయి ఉద్యోగాలకూ అవసరం.

● సమస్యా పరిష్కారం అనేది ఒక క్లిష్టమైన నైపుణ్యం. ఇందులో క్రిటికల్ థింకింగ్, డెసిషన్ మేకింగ్, క్రియేటివిటీ, ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్ అనే స్కిల్స్ అన్నీ భాగంగా ఉంటాయి. ఒక పెద్ద సమస్యను చిన్న చిన్న భాగాలుగా విభజించడం.. ఒక్కొక్కటీ పరిష్కరించుకుంటూ రావడం.. ఇలాంటి విభిన్నమైన ప్రక్రియలను ఇందుకోసం పాటించాలి. దీనిలో ప్రధానంగా మూడు అంచెలుంటాయి.

మొదటి దశ

సమస్యను గుర్తించడం: సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించే ముందు అసలు సరిగ్గా సమస్య ఏంటో గుర్తించడం ప్రధానం. దీనికోసం ఆ ప్రాబ్లమ్ వల్ల ఇబ్బంది పడుతున్న వారితో మాట్లాడటం, పూర్తి వివరాలు - కారణాలు రిసెర్చ్ చేయడం, ఫీల్డ్‌లో నిపుణులను సంప్రదించడం వంటివి చేయాలి.

రెండోదశ

పరిష్కారాల జాబితా సిద్ధం చేయడం: సమస్యను పరిష్కరించేందుకు ఎటువంటి పరిష్కారాలు చేయవచ్చో ఒక జాబితా సిద్ధం చేయడం, ఏ పరిష్కారం ఎంతవరకూ ఫలితాలనిస్తుందో అంచనా వేయడం, అన్నింటికంటే సరైన దాన్ని ఎంచుకోవడం ఇందులో భాగం.

పరిష్కారాన్ని ఆచరించడం: ఈ సమయంలో పరిష్కారం కోసం ఎటువంటి వనరులు అవసరం అవుతాయి అనే విషయాన్ని గమనించాలి. డబ్బు, నిపుణులు, టెక్నాలజీ.. ఇలా ఏది అవసరం అనే విషయాన్ని గుర్తించాలి. అంతిమంగా అతి సులభమైన వేగవంతమైన, పరిష్కార మార్గాన్ని అవలంబించడం అవసరం.

మూడోదశ

రెజ్యూమెలో కనిపించేలా..

రెజ్యూమెలో సమస్యా పరిష్కార నైపుణ్యాలను చూడగానే అవతలివారు గుర్తించేలా రాసుకోగలగాలి. ఆకర్షించే భాష, ముఖ్యంగా క్రియాశీలక పదాలు (యాక్షన్ వెర్బ్స్) ఉపయోగించడం ద్వారా దీన్ని సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. నిర్దిష్టమైన విషయాలను వివరంగా చెప్పేలా వాక్యాలు ఉండాలి. చెప్పాలనుకునే అంశాన్ని కుదిరితే అంకెల్లో చెప్పడం ద్వారా సూటిగా వివరించవచ్చు.

ఈ లక్షణాలు కూడా అవసరం

1 సృజనాత్మకత: కొత్తగా వచ్చే సమస్యలను పరిష్కరించాలంటే.. మన ఆలోచనలు కూడా కొత్తగానే ఉండాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్‌కు క్రియేటివిటీ అవసరం. సృజనతోనే మనం పరిష్కారాల కోసం కొత్త దారులు వెతుకుతాం. ఇది ఉద్యోగుల పనితీరును మెరుగుపరిచి కంపెనీలకు ఖర్చులు తగ్గించడానికి, కొత్త ఆలోచనలు ఇచ్చేందుకు, వినియోగదారునికి సంతృప్తికరమైన సేవలు అందించేందుకు.. సమాచారాన్ని విశ్లేషించి నూతన ట్రెండ్స్, అవకాశాలు గుర్తించేందుకు... ఇలా అనేక రకాలుగా ఉపయోగపడుతుంది.

2 పరిశోధన : క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో పరిశోధన ముఖ్యపాత్ర పోషిస్తుంది. విభిన్నమైన వనరుల ద్వారా సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, నిర్వహించడం వల్ల కచ్చితమైన పరిష్కారాన్ని వెతికే వీలుంటుంది. కొత్త మార్కెట్, కస్టమర్లను గుర్తించడం, పోటీదారుల గురించి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండటం, పరిశ్రమపై అవగాహన పెంచుకోవడం, గత పనితీరును అంచనా వేసుకోవడం.. ఇలా అన్నింటికీ రిసెర్చ్ నైపుణ్యాలు అవసరం.

3 కమ్యూనికేషన్: సమస్యను అర్థం చేసుకున్నాక, పరిష్కారాన్ని గుర్తించాక.. ఇతరులతో పంచుకోవడానికి కమ్యూనికేషన్ నైపుణ్యాలు చాలా ముఖ్యం. ఇందుకు వెర్బల్, రిటన్ కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు అవతలి వారు చెప్పేది జాగ్రత్తగా వినడం, వారి కోణాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం అభివృద్ధి చేసుకోవడం ముఖ్యం. లక్ష్యాలను నిర్దేశించుకోవడం, అందరితో కలసికట్టుగా పనిచేయడం.. వీటన్నింటిలో కమ్యూనికేషన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది.

4 బృందంతో పని: బృందాల్లో కలిసి పనిచేయడం ప్రాబ్లమ్ సాల్వింగ్‌ను ప్రభావవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుంది. విభిన్నమైన పనితీరు కలిగిన వారు కలిసి సమస్యలను పరిష్కరించడంలో వినూత్నమైన మార్గాలను అన్వేషిస్తారు. దీని ద్వారా ఉత్తమమైన పరిష్కారం కనుగొనే వీలుంటుంది. ఇందుకు ధైర్యంగా మాట్లాడే వాతావరణం, ఫీడ్‌బ్యాక్ తీసుకునే అలవాటు ఉండాలి. సమష్టి లక్ష్యసాధనకు ఒక్కొక్కరూ తమదైన శైలిలో కష్టపడాలి.

5 నిర్ణయాలు తీసుకోవడం: సమస్యా పరిష్కారంలో డెసిషన్ మేకింగ్ మరో ప్రధానాంశం. సమస్యను గుర్తించడంలోనూ, పరిష్కరించడంలోనూ ప్రతి దశలోనూ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. డెసిషన్ మేకింగ్‌లో వేగం, కచ్చితత్వం అవసరం. ఏది ఎంత వరకూ చేయాలో నిర్ధరించుకోవడంతోనే సరైన నిర్ణయాలు తీసుకోగలం.

ఎలా?

చాలా మంది సమస్యలను పరిష్కరించడం కంటే వాటిని చూసీచూడనట్లు వదిలేయడానికే ప్రయత్నిస్తారు. కానీ అలా కాకుండా వాటిని గుర్తించి పరిష్కరించడానికి ప్రయత్నించే ఆలోచనా ధోరణిని అలవాటు చేసుకోవాలి. ఇది కేవలం ఒక్కరోజులో నేర్చుకుంటే వచ్చేసేది కాదు.. స్థిరంగా అభివృద్ధి చేసుకోవాల్సిన లక్షణం. విభిన్నమైన ఆలోచనలను అర్థం చేసుకునే ఓపిక, అవసరం అయితే ఇతరుల సలహాలు తీసుకోవడం, నిర్ణయం తీసుకునే ముందు పూర్తిస్థాయిలో సమాచారాన్ని దగ్గర ఉంచుకోవడం వంటివన్నీ.. ఈ లక్ష్యాన్ని సాధించే సోపానాలు.

కోర్సులు

కోర్సెరా, యుడెమీ, స్కిల్‌షేర్, ఎడ్‌ఎక్స్, లెర్నింగ్ ట్రీ, లింక్డిన్ లెర్నింగ్ వంటి ప్రధానమైన ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో దీనికి సంబంధించి అనేక కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 'ఎఫెక్టివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, కంప్యుటేషనల్ థింకింగ్, క్రియేటివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్..' ఇలా అనేక విధాలుగా లభిస్తున్న కోర్సుల ద్వారా వీటిని నేర్చుకోవచ్చు.

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

టీఐఎఫ్ఆర్‌లో పీహెచ్‌డీ, ఐ-పీహెచ్‌డీ, ఎంఎస్సీ

ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ దేశవ్యాప్తంగా ఉన్న టీఐఎఫ్ఆర్ విభాగాలు/ కేంద్రాలు/ స్కూల్స్‌లో పీహెచ్‌డీ, ఐ-పీహెచ్‌డీ, ఎంఎస్సీ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
టీఐఎఫ్ఆర్ విభాగాలు: హెచ్‌బీసీఎస్ఈ ముంబయి, టీఐఎఫ్ఆర్ ముంబయి, సీఏఎం బెంగళూరు, ఐసీటీఎస్ బెంగళూరు, ఎస్‌సీబీఎస్ బెంగళూరు, టీఐఎఫ్ఆర్ హైదరాబాద్, ఎన్‌సీఆర్‌ఏ పుణె.
సబ్జెక్టులు: సైన్స్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ సైన్స్ అండ్ లెర్నింగ్, ఇన్ఫర్మేషన్ అండ్ డేటా సైన్స్, మ్యాథమెటిక్స్, అప్లైడ్ అండ్ కంప్యుటేషనల్ మ్యాథ్స్, వైల్డ్ లైఫ్ బయాలజీ అండ్ కన్జర్వేషన్, బయాలజీ, ఫిజిక్స్ ఆఫ్ లైఫ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ.
అర్హత: ప్రోగ్రామ్‌ను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ.
ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా. ప్రోగ్రామ్‌ను అనుసరించి గేట్/ నెట్/ జెస్ట్/ జేజీఈఈబీఐఎల్ఎస్ ఉత్తీర్ణులకు ప్రవేశ పరీక్ష నుంచి మినహాయింపు ఉంటుంది.
దరఖాస్తు రుసుము: పురుష అభ్యర్థులు రూ.1000. మహిళా అభ్యర్థులు, ఇతరులకు రూ.500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02-11-2023.
హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభం: 20-11-2023. **పరీక్ష తేదీ:** 10-12-2023.
ప్రోగ్రామ్ ప్రారంభం: 01-08-2024.
వెబ్‌సైట్: https://www.tifr.res.in/~academics/gs_admissions.php

ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్

ఫోరెన్సిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏఐఎఫ్ఎస్ఈటీ-2023) ప్రకటన వెలువడింది. ఈ పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా 35 యూనివర్సిటీల్లో బీఎస్సీ, ఎంఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సుల్లో ఫీల్డ్ సైన్స్, ల్యాబొరేటరీ డేటా సైన్స్, మెడికల్ డేటా సైన్స్ విభాగాలుంటాయి.
పాల్గొనే వర్సిటీలు: వివేకానంద గ్లోబల్ విశ్వవిద్యాలయం, ఎంఏటీఎస్ విశ్వవిద్యాలయం (రాయ్‌పూర్), బ్రహ్మ విశ్వవిద్యాలయం (షిమ్లా హిల్స్), ఇన్వర్టిస్ విశ్వవిద్యాలయం (బరేలీ), ఆర్ఆర్ ఇన్‌స్టిట్యూషన్స్ (బెంగళూరు) తదితరాలు.
1. మూడేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్
అర్హత: హయ్యర్ సెకండరీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ లేదా మ్యాథమెటిక్స్) తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
2. రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్: ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్
సబ్జెక్టులు: ట్రాన్స్‌పోర్ట్ ఫినామినా, కెమికల్ ఇంజినీరింగ్ కంప్యూటింగ్, అడ్వాన్స్‌డ్ థర్మోడైనమిక్స్, కెమికల్ రియాక్టర్ ఇంజినీరింగ్, డిజైన్ తదితరాలు.
అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ (ఫోరెన్సిక్ సైన్స్ లేదా సంబంధిత సబ్జెక్టులు) ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రతిభ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.2000. **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** 28-10-2023.
ప్రవేశ పరీక్ష తేదీ: 29-10-2023. **పరీక్ష ఫలితాల వెల్లడి:** 31-10-2023.
వెబ్‌సైట్: https://aifset.com/

ఎయిమ్స్ జోధ్‌పుర్‌లో ఎంపీహెచ్

జోధ్‌పుర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్- జనవరి 2024 సెషన్‌కు సంబంధించి మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్ (ఎంపీహెచ్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
మొత్తం సీట్లు: 20
వ్యవధి: ఫుల్ టైం రెండేళ్ల కోర్సు **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ
ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.800. యూఆర్/ ఓబీసీలకు రూ.1000.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు తేదీ: 19-10-2023.
హాల్ టికెట్ డౌన్‌లోడ్: 06-11-2023.
ప్రవేశ పరీక్ష తేదీ: నవంబర్ 2023. **సెషన్ ప్రారంభం:** 11-01-2024.
వెబ్‌సైట్: https://aiimsjodhpur.edu.in/

దిల్లీ వైద్యశాలల్లో ఉపాధి అవకాశాలు

న్యూదిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, కళావతి సరన్ చిల్డ్రన్స్ హాస్పిటల్, రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్లు సంయుక్తంగా 909 పారామెడికల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశాయి. కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్ (సీబీటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఈ ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు.

909 పారామెడికల్ కొలువులు

మొత్తం 909 పోస్టుల్లో.. ఫ్యామిలీ వెల్ఫేర్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేటర్-2, కంప్యూటర్-1, రేడియోగ్రాఫర్-22, ఎక్స్‌రే అసిస్టెంట్-18, ఈసీజీ టెక్నీషియన్-11, మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్ట్-159, జూనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్ట్-51, ఫార్మసిస్-13, ఫిజియోథెరపిస్ట్-42, ఆపరేషన్ థియేటర్ అటెండెంట్-20, నర్సింగ్ అటెండెంట్-218, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్-274, ఇతర పోస్టులు-78 ఉన్నాయి.

పోస్టును అనుసరించి అభ్యర్థులు సంబంధిత విభాగంలో.. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పాసై ఉండాలి. దరఖాస్తు ఫీజు రూ.600. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.

సీబీటీలో...

కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్‌లో 60 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు.
● ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది.
● నెగెటివ్ మార్కులు ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికీ 1 మార్కును తగ్గిస్తారు. అభ్యర్థులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని.. కచ్చితంగా తెలిసిన ప్రశ్నలకు మాత్రమే జవాబులను గుర్తించాలి.
● ప్రశ్నల స్థాయి కనీస విద్యార్హత స్థాయి మీదే ఆధారపడి ఉంటుంది. పోస్టును బట్టి పదోతరగతి కనీసార్హత స్థాయి అయితే.. పరీక్ష సిలబస్ కూడా అదే స్థాయిలో ఉంటుంది.
● పరీక్ష తేదీని వెబ్‌సైట్‌లో ప్రకటించి.. అడ్మిట్ కార్డ్ ద్వారా తెలియజేస్తారు.

సన్నద్ధత ఎలా?

విద్యార్హత ఆధారంగా సిలబస్ ఉంటుంది. కాబట్టి సబ్జెక్టుల మీద గట్టి పట్టు సంపాదించాలి.
● ఆన్‌లైన్‌లోనే పరీక్ష రాయాలి. దీన్ని అలవాటు చేసుకోవడం కోసం వివిధ వెబ్‌సైట్లలో ఉచితంగా అందుబాటులో ఉండే ఆన్‌లైన్ పరీక్షలు రాసుకోవచ్చు.
● ప్రకటించిన వివరాల ప్రకారం... నవంబరు నాలుగోవారంలో పరీక్ష ఉంటుంది. అంటే.. సుమారుగా నెల రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంది. కాబట్టి సన్నద్ధతను ఇప్పటినుంచే మొదలుపెట్టాలి.
● ఏ సబ్జెక్టుకు ఎంత సమయాన్ని కేటాయించాలనేది టైమ్ టేబుల్ వేసుకుని.. దాన్ని కచ్చితంగా అమలుచేయాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 25.10.2023
అన్‌లైన్ ఫీజు చెల్లింపు చివరి తేదీ: 26.10.2023
అడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడింగ్: నవంబరు మొదటివారం, 2023
పరీక్ష: నవంబరు నాలుగోవారం, 2023 **ఫలితాల వెల్లడి:** డిసెంబరు మొదటి వారం, 2023
డాక్యుమెంట్ వెరిఫికేషన్: డిసెంబరు రెండో వారం, 2023
వెబ్‌సైట్: www.vmmc-sjh.nic.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

ఫ్లట్టర్ డెవలప్‌మెంట్

సంస్థ: ఆస్టెల్లో ఇండియా **స్టైపెండ్:** నెలకు రూ.6,000-10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 18 **అర్హతలు:** ఏడబ్ల్యూఎస్, ఆండ్రాయిడ్, డార్ట్, ఫ్లట్టర్, ఐఓఎస్, నోడ్.జేఎస్ నైపుణ్యాలు
internshala.com/i/88b7ee

రిక్రూట్‌మెంట్

సంస్థ: కార్యార్థ్ కన్సల్టెంట్స్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 19 **అర్హతలు:** ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఎంగేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, రిక్రూట్‌మెంట్ నైపుణ్యాలు internshala.com/i/ca221c

వీడియో ఎడిటింగ్

సంస్థ: యువర్ డిజిటల్ లిఫ్ట్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000-13,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 19 **అర్హతలు:** అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో నైపుణ్యాలు
internshala.com/i/a72b48

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: స్కిల్‌ఎరీనా ఎడ్యుకేషన్ టెక్నాలజీస్ **స్టైపెండ్:** నెలకు రూ.1,000 **దరఖాస్తు గడువు:** అక్టోబరు 19 **అర్హతలు:** ఇంగ్లిష్ రాయడం, మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
internshala.com/i/669367

ఎస్ఎంఈ – కెమిస్ట్రీ

సంస్థ: క్యూఏ సాల్వర్స్ **స్టైపెండ్:** నెలకు రూ.12,000-22,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 19 **అర్హతలు:** కెమిస్ట్రీ, కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం
internshala.com/i/a8b0bf

పెర్ఫామెన్స్ మార్కెటింగ్

సంస్థ: టిక్ టాక్ టో ఫుట్‌వేర్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 19 **అర్హతలు:** ఫేస్‌బుక్ యాడ్స్, ఫేస్‌బుక్ మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/23c412

టెలికాలింగ్

సంస్థ: హంట్ డిజిటల్ మీడియా **స్టైపెండ్:** నెలకు రూ.4,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 19 **అర్హతలు:** ఇంగ్లిష్, హిందీ మాట్లాడటంలో నైపుణ్యం internshala.com/i/7e5bf0

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: శ్రీ జెనిసిస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ **స్టైపెండ్:** నెలకు రూ.3,000 **దరఖాస్తు గడువు:** అక్టోబరు 19
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ ప్రావీణ్యం, ఎస్ఈఓ, ఎస్ఈఎం, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు internshala.com/i/39ff42

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: శ్రేష్ఠం ఎడ్యుకేషన్ ట్రస్ట్ **స్టైపెండ్:** నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 11 **అర్హతలు:** ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్ నైపుణ్యాలు internshala.com/i/360ec7